ప్రజాశక్తి
మంగళవారం 30 మే 2023
5
అనంతపురం

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎమ్.గౌతమి

కొట్టుకున్న వైసిపి నేతలు

◆ కోనాపురంలో అధికార పార్టీ నేతల బాహాబాహి
◆ చెప్పలతో దాడులు చేసుకున్న నాయకులు
◆ రూ.1.21 కోట్ల పనుల్లో రూ.30 లక్షలు మింగేశారు..
◆ మొక్కలు పెట్టామంటూ నిధులు స్వాహా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, కనగానపల్లి

పేదల కోసం చేపట్టిన పనులను చేయకుండానే అధికారపార్టీ నేతలు మేసేశారు. డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పేరుతో మొక్కలు పెట్టినట్టు రికార్డుల్లోకెక్కించి లక్షల రూపాయలు మింగేశారు. ఈ డబ్బుల వ్యవహారం సామాజిక తనిఖీలో వెల్లడయిన తరువాత తమకూ అందులో వాటా అందలేదని మరో గ్రూపు ఘర్షణకు దిగింది. రెండు రోజుల క్రితం పంచాయతీ జరిగినా సమస్యకు పరిష్కారం లభించలేదు. కార్యాలయం ఎదుటే పరస్పరం చెప్పులతో దాడులు చేసుకోవడంతో ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అవినీతి కాస్త వెలుగులోకి వచ్చింది.

రూ.1.21 కోటి పనిచేసి రూ.30 లక్షలు మింగేశారు...

సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం పరిధిలోని కోనాపురం గ్రామం పరిధిలో 2021 ఏప్రిల్ ఒకటవ తేది నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు గ్రామ పంచాయతీ పరిధిలో 165 పనులు చేశారు. సుమారు రూ.1.21 కోట్ల విలువైన పనులు చేశారు. ఇందులో రూ.56.55 లక్షలు వేతనాలకింద కూలీలకు డబ్బులు చెల్లించారు. మరో రూ.65.42 లక్షలు మెటీరియల్ కాంపొనెంట్ కింద ఉపాధి హామీ పథకం నుంచి నిధులు వెచ్చించారు. జరిగిన ఈపనులన్నింటినీ ఈ ఏడాది మార్చి నెలలో సామాజిక తనిఖీని చేపట్టారు. ఈ సామాజిక తనిఖీలో పరిశీలించినప్పుడు పెద్ద ఎత్తున అవకతవకలు చోటు చేసుకున్నట్టు స్పష్టమైంది. 19 పనుల్లో నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు డ్రా చేసినట్టు తేలింది. ఇందులో ప్రధానమైనది డ్రై ల్యాండ్ హార్టికల్చర్ పేరుతో మొక్కలు పెట్టకుండానే డబ్బులు డ్రా చేసేశారు. వర్కు కోడ్ 9166008170869, 857,837,842,835,858 పనుల కింద జామ, మామిడి మొక్కలు 7604 నాటినట్టు చూపించి ఒకే దగ్గర రూ.19.17 లక్షలు డబ్బులు కాజేశారు. అదే పద్ధతిలో మరో చోట రూ.5.98 లక్షలు, ఇంకో చోట బ్లాక్ ప్లాంటేషన్ పేరుతో వెయ్యి మొక్కటు నాటినట్టు చూపించి రూ.4.08 లక్షలు ఇలా మొత్తం 19 పనుల్లో ఈ అక్రమ చోటు చేసుకున్నట్టు సామాజిక తనిఖీల్లో స్పష్టమైంది. అంతేకాకుండా సగం మంది వద్ద జాబ్‌కార్డులు కూడా వారిద్దలేవని, నేతల వద్దనే ఉన్నట్టు కూడా సామాజిక తనిఖీల్లో తేలింది. ఈ కార్డులను వారి వద్ద ఉంచుకుని బిల్లులను డ్రా చేసి తినేసినట్టు ఆరోపణలున్నాయి.

ఎంపిడిఒ కార్యాలయంలో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్న కోనాపురం వైసిపి నాయకులు

వైసీపీ నాయకుడు ఆత్మహత్యా యత్నం

మండల పరిధిలోని కోనాపురం గ్రామ వైసీపీ నాయకుడు పైలట్ ముత్యాలు సోమవారం సాయంత్రం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి అనంతపురం నగరంలోని ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. ఉపాధి హామీ బిల్లుల అవినీతి బహిర్గత ఘటనలో స్థానిక ఎంపీటీసీ, వైసీపీ నాయకుడు పైలట్ ముత్యాలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట దాడులు చేసుకున్నారు. అయితే ఈ విషయంపై స్థానిక పోలీసులు తన ఇంటి వద్దకు వచ్చి విచారణ చేయడంతో పైలెట్ ముత్యాలు అవమానంగా భావించాడు. తమ పార్టీ అధికారంలో ఉండి కూడా తన ఇంటికి పోలీసులు రావడాన్ని జీర్ణించుకోలేక పోయాడు. ఉపాధి పథకంలో దొంగ బిల్లులు పెట్టుకొని లక్షల రూపాయలు కాజేసిన వారిని వదిలి పోలీసులు ప్రజాప్రతినిధుల ప్రోత్సాహంలో తనను విచారణ చేయడాన్ని అవమానంగా భావించిన ముత్యాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని అతని కుటుంబసభ్యులు తెలిపారు.

చెప్పలతో కొట్టుకున్న నేతలు

కనగానపల్లి : అధికార పార్టీ నేతలు బాహాబాహికి దిగారు. ఉపాధి డబ్బులు చెల్లింపు, పంపకాల విషయంలో వచ్చిన తేడాలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఏకంగా ఎంపిడిఒ కార్యాలయంలోనే నేతలు చెప్పులతో దాడులు చేసుకున్నారు. సోమవారం ఉదయం శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో చోటు చేసుకున్న ఈ ఘటన అధికార పార్టీలో నేతల మధ్య ఉన్న అసమ్మతి మరోసారి బట్టబయలు అయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కనగానపల్లి మండలం కోనాపరం పంచాయతీకి సంబంధించి ఉపాధి హామీ కార్యాలయం కంప్యూటర్ ఆపరేటర్ సహకారంతో గ్రామ ఎంపీటీసీ వర్గం కలిసి ఉపాధి హామీ పనులు చేయకుండానే చేసినట్లు చూపి సుమారు రూ.పది లక్షలు బిల్లులు చేసుకున్నట్లు అదేగ్రామానికి చెందిన వైసిపి నేతలు వారిపై ఆరోపణలు చేస్తున్నారు. ఈ డబ్బుల పంపకాలకు సంబంధించి గ్రామంలో ఓ వైసిపి నాయకుడు, ఎంపిటిసి వర్గంకు మధ్య గత కొన్ని రోజులుగా వివాదం నడుస్తోంది. రెండు రోజులు కిందట గ్రామంలో ఘర్షణ పడ్డారు. ఈ విషయం తెలిసి వైసీపీ మండల ప్రధాన నాయకుడు వారికి సర్దిచెప్పి గొడవ పెద్దది కాకుండా సద్దుమణిగేలా చేశాడు. అప్పటికి మౌనంగా ఉన్న నేతలు సోమవారం నాడు మళ్లీ గొడవపడ్డారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వద్ద వైసీపీ ప్రధాన నాయకుని సమక్షంలో చర్చిస్తున్న సందర్భంలో కోనాపురం ఎంపీటీసీ వర్గం, అదే గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రెండు వర్గాలుగా విడిపోయి భౌతికదాడులు చేసుకున్నారు. మండల వైసీపీ ప్రధాన నాయకుడు, పోలీసులు సమక్షంలోనే ఎంపీడీవో కార్యాలయంలో ఏకంగా చెప్పులతో దాడులు చేసుకున్నారు. వీరి దాడులతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు కలుగజేసుకుని ఇరవర్గాల వారిని చెదరగొట్టి అక్కడి నుంచి పంపివేశారు. అక్రమంగా ఉపాధి బిల్లులు కాజేయడం కోసం అధికార పార్టీ నేతలు ఇలా ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం ఏమిటంటూ స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. కాగ ఈ ఘటనపై ఆ పార్టీ ముఖ్యనేతలు ఎవరూ స్పందచలేదు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

◆ స్పందనపై నిర్లక్ష్యం చేయరాదు ◆ కలెక్టర్ ఎమ్.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలకు సంబంధించి రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారులు సంతప్తి చెందేలా వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ట్రైనీ కలెక్టర్ కుశాల్ జైన్, డిఅర్ఒ గాయత్రి దేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, అన్సెట్ సిఇఒ కేశవ నాయుడు, ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో స్వీకరించే అర్జీలను సకాలంలో పరిష్కరించాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వర్క్ షాపులు నిర్వహించి, వారిసిబ్బందికి అర్జీల పరిష్కారంపై అవగాహన కల్పించాలని, షెడ్యూల్ ప్రకారం సంబంధిత అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. అర్జీలన్నింటినీ సకాలంలో నాణ్యతగా పరిష్కరించాలని,ఏ ఒక్కటి కూడా గడువు దాటిన తర్వాత పరిష్కరించరాదన్నారు. డిఎమ్‌హెచ్ఒకు అందిన ఒక అర్జీ గడువు దాటిన తరువాత కూడా పరిష్కరించక పోవడంతో షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డిఆర్ఒకు సూచించారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ ఆర్థికపరమైన అంశాలకు సంబంధించిన అర్జీలపై పోర్టల్ లో పేర్కొన్న ఆప్షన్స్‌ను డ్రాప్ డౌన్‌లో సక్రమంగా ఎంచుకుని సెలెక్ట్ చేయగలిగితే జిల్లా అధికారుల లాగిన్ నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల లాగిన్ లోకి వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ ఎం.సాయిరామ్

పకడ్బందీగా పది సప్లిమెంటరీ పరీక్షలు

2వ తేదీ నుంచి ప్రారంభం
డిఇఒ ఎం.సాయిరామ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

త్వరలో జరగబోయే పది సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అధికారులు అన్ని చర్యలు చేపట్టాలని డిఇఒ ఎం.సాయిరామ్ తెలియజేశారు. సోమవారం ఉదయం నగరంలోని కెఎస్ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జూన్ రెండో తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 49 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయని చెప్పారు. 14,465 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని చెప్పారు. ప్రశ్నాపత్రాలు మంగళవారం జిల్లాకు వస్తాయని, వాటిని బుధవారం ఆయా పోలీస్ స్టేషన్లకు తరలిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీరు, ఫ్యాన్లు, లైట్లు, బెంచీలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షలు జరిగే సమయంలో బయట వ్యక్తులను ఎవర్నీ కేంద్రంలోకి అనుమతించకూడదన్నారు. మాస్‌కాపీయింగ్ లేకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ గోవింద నాయక్, డివైఈవోలు పద్మప్రియ, శంకర ప్రసాద్, పర్యవేక్షకులు సరళ, పాల్గొన్నారు.

బదిలీ నియామక పత్రాలను అందిస్తున్న ఎస్పీ కె.శ్రీనివాసరావు

పారదర్శకంగా పోలీసుల బదిలీలు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లా పోలీసు శాఖలో బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కె.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన బదిలీల కార్యక్రమంలో 71 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు/, ఎఎస్ఐలకు బదిలీలు చేసినట్లు చెప్పారు. 30-04-23వ తేదీ నాటికి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందిని సీనియార్టీ జాబితా ప్రకారం పారదర్శకంగా బదిలీలు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జిల్లా పోలీసు పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసుల నాయుడు, శివప్రసాద్ పాల్గొన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోండి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా కేంద్రంలో అనుమతులు లేని, అర్హత లేని ఫ్యాకల్టీ ద్వారా కోచింగ్ ఇస్తున్న కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలకష్ణ, నరసింహ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో విడుదల చేయనున్న గ్రూప్-1,2 పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ప్రకటన రావడంతో అనాధికర కోచింగ్ సెంటర్లు పుట్టుకొస్తున్నాయని తెలిపారు. అనుభవనం లేని ఫ్యాకల్టీలను ఏర్పాటు చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. వీటిపై అధికారులు తనిఖీలు నిర్వహించి అలాంటి సెంటర్లను మూసి వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

జెసికి వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

రైతులకు అండగా ప్రభుత్వం

◆ మంత్రి ఉషశ్రీ చరణ్
◆ సబ్సిడీ వేరుశనగ విత్తన పంపిణీ ప్రారంభం
◆ మొదటి రోజు 3,113 క్వింటాళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం, అనంతపురం

రైతులకు అన్ని విధాలా ప్రభుత్వం అండుగా నిలుస్తోందని, అందులో భాగంగా సబ్సిడీ వేరుశన విత్తనాలను ఆర్‌బికెల ద్వారా అందిస్తున్నట్లు మంత్రి ఉషశ్రీ చరణ్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని పాలవాయి గ్రామంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసేందుకు అర్హులైన రైతులకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తన కాయలు అందజేస్తోందన్నారు. విత్తన నాణ్యతలో ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకొందన్నారు. విత్తన పంపిణీలో కానీ, నాణ్యతలో కానీ సమస్యలు తలెత్తితో వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. మంత్రి వెంట అధికారులు, మండల వైసీపీ నాయకులు ఉన్నారు.

రైతులకు సబ్సిడీ విత్తన పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

మొదటి రోజు 3,113 క్వింటాళ్లు పంపిణీ

అనంతపురం : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం అందించే విత్తన పంపిణీని మొదటి రోజు జిల్లా వ్యాప్తంగా 3459 మంది రైతులకు 3,113 క్వింటాలు పంపిణీ జరిగింది. అనంతపురం అర్బన్ నియెజకవర్గం పరిధిలోని నారాయణ పురం ఆర్‌బికెలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.చంద్రానాయక్‌లు విత్తక కాయలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమములో అనంతపురం రూరల్ మండల వ్యవసాయ అధికారి పి.వెంకటేశ్వర ప్రసాద్, జడ్పీటీసీ చంద్రకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రసాద్, మురళి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్స్, పంచాయతీ కార్యదర్శి అశోక్, మండల వ్యవసాయ సలహా మండలి సభ్యులు రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచి ఉమ్మడి జగన్మోహన్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దారెడ్డి హయాంలో తాడిపత్రిలో ఫ్యాక్షన్ నిర్మూలన

రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి, ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-తాడిపత్రి

నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ఫ్యాక్షన్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యపరచిన ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తీరు అభినందనీయమని రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. తాడిపత్రి నియోజకవర్గాన్ని సంక్షేమం, అభివద్ధి పథం వైపు నడిపించేందుకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేపట్టిన 3వ విడత ప్రజా సంక్షేమ పాదయాత్ర సోమవారం ముగిసింది. ఇందులో భాగంగా తొలుత వైసిపి ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభించి బస్టాండ్ సర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీచరణ్, గుంతకల్లు ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసిపి జిల్లా నాయకులు విశ్వేశ్వరరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, హిందూపురం వేణుగోపాల్‌రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులు సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలతో ఏపీ శ్రీలంకలా మారబోతోందని విమర్శించిన చంద్రబాబు నేడు ఆయన విడుదల చేసిన టిడిపి మేనిఫెస్టోపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పెద్దారెడ్డి అంటే రౌడీ, ఫ్యాక్షనిస్టు అని పేర్కొన్న వారి గుండెల్లో దడ పుట్టిస్తూ, నియోజకవర్గంలో ప్రశాంత రాజకీయ పరిస్థితులు నెలకొల్పి, ప్రజల గుండెల్లో స్థానం మరింత పదిలం చేసుకున్నాన్నారు. తాడిపత్రిలో ఒక నాయకుడు దొంగబాబా వేషంలో తిరుగుతాడని వారిని నమ్మొద్దని కోరారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ పెద్దారెడ్డి గెలిస్తే ప్రతి పల్లెలో, వార్డులో రౌడీయిజం చేస్తారని జెసి కుటుంబం కోడై కూసిందని, అయితే నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఎక్కడా చిన్న ఘర్షణ కూడా చోటు చేసుకోలేదని గుర్తు చేశారు. ప్రతీకార చర్యలకు పాల్పడకుండా కార్యకర్తలను క్రమశిక్షణతో నడిపిస్తూ బాధితుల పక్షాన నిలబడ్డామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ. 200కు కొళాయి కనెక్షన్, 20 ఎకరాల్లో పార్కు, వంద పడకల ఆసుపత్రి, మార్కెట్ ఆవరణలో ఆరోగ్య కేంద్రం నిర్మించామని గుర్తుచేశారు. చెరువులు, ప్రాజెక్టులను నీటితో నింపి రెండు పంటలకు సాగునీరు అందించామన్నారు. తనపై ఆరోపణలు చేస్తూ పంచిన కరపత్రాలపై చర్చకు సిద్ధమన్నారు. ప్రజాస్వామ్యానికి విలువ తెలియని నాయకులు, అసాఘింక కార్యకలాపాలకు కేరాఫ్ అడ్రస్ జెసి కుటుంబం అని ఆరోపించారు. అవినీతికి పాల్పడి వాహనాలు నడిపి అనేక ప్రాణాలు బలిగొన్న వ్యక్తి జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు.

3వ విడత ప్రజాసంక్షేమ యాత్ర ముగింపులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి

కార్మికులకు గ్రాట్యుటీ చెల్లింపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీసత్యసాయి నీటిసఫరాలో పని చేస్తూ మరణించిన ఆరుగురు కార్మికుల కుటుంబాలకు 1.71 లక్షల చెక్కులను సోమవారం నాడు అనంతపురం కార్మిక శాఖ కార్యాలయంలో డిసిఎల్ జి.రఘురాములు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ సత్యసాయి తాగునీటి సరఫరాలో పని చేస్తూ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు గ్రాట్యుటీ 6 మందికి డిసిఎల్ పంపిణీ చేయడం కార్మికుల విజయం అన్నారు. కార్మికులకు గ్రాట్యుటీ ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యంలో మూడు సమ్మెలు, 18 రోజుల కార్మికుల రిలే దీక్షలు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో అధికారులతో జరిగిన సంప్రదింపుల మేరకు మొదటి దిశగా ఆరుగురికి కార్మికులకు సాయం అందిందన్నారు. ఇంకా 51 మంది కార్మిక కుటుంబాలకు గ్రాట్యుటీ అందాల్సి ఉందని వారికి కూడా వెంటనే ప్రభుత్వం చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి బోర్డ్ ఆఫీస్ టైమ్కీ ఆఫీసర్ రాజు, సత్యసాయి తాగునీటి సరఫరా యూనియన్ నాయకులు తిప్పేస్వామి, రవిచారి, గోవిందు, రమేష్ రెడ్డి, సుంకన్న పాల్గొన్నారు.

గ్రాట్యుటీ చెక్కును తీసుకుంటున్న ఓబులు, కార్మికులు

ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక స్పందన నిర్వహించాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేక స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప కోరారు. ఈ మేరకు సోమవారం నాడు స్పందనలో కలెక్టర్ ఎమ్.గౌతమికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు, దౌర్జన్యాలు అధికం అయ్యాయన్నారు. దళిత, గిరిజనుల భూములను ఆక్రమణలకు గురవుతున్నాయని చెప్పారు. దీనిపై కిందిస్థాయిలో గ్రామ సచివాలయాలు, మండల తహాశీల్దార్, డివిజన్ స్థాయిల్లో అనేకసార్లు వినతిపత్రాలు ఇస్తున్నా తగ్గిన ఫలితం లేదన్నారు. సకాలంలో అధికారుల స్పందించేలా సంబంధిత అధికారులను ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక స్పందన కార్యక్రమానికి హాజరై వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి కాల నిర్ణయంతో కూడిన పరిష్కారం చూపే ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యపై కలెక్టర్ స్పందిస్తూ ఈ విషయంపై అధికారులతో చర్చించి వీలైనంత తొందరలో ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు దసరా బుల్లోడు, ఆంజనేయులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

పత్తి పంటను తొలగిస్తున్న రైతు కిష్టప్ప

నకిలీ విత్తనాలతో పెరగని పత్తి పంట.. తొలగించిన రైతు

రాయదుర్గం రూరల్: మండల పరిధిలోని మల్లాపురం గ్రామానికి చెందిన రైతు కిష్టప్ప డెబ్బతిన్న పత్తి పొంటను సోమవారం తొలగించారు. ఆయన రాయదుర్గం పట్టణంలోని ఓ ఎరువుల దుకాణంలో రెండున్నర నెలల క్రితం విత్తనాలు కొనుగోలు చేసి తనకున్న రెండెకరాల పొలంలో పత్తి పంటను సాగు చేశాడు. అయితే పత్తి కాయలు ఏర్పడకపోగా ఎర్రగా మారి ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక సోమవారం పంటను తొలగించాడు. నకిలీ విత్తనాల వల్లే ఇలా జరిగిందని, రూ. లక్ష పైగా నష్టపోయినట్లు వాపోయాడు. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులు ఉన్నాయని, దీనిపై వ్యవసాయ అధికారులు వాస్తవాలు తేల్చాలని కోరాడు.

గుర్తింపు లేని పాఠశాలల్లో పిల్లలను చేర్చవద్దు

ఉరవకొండ : ప్రభుత్వ గుర్తింపులేని ప్రయివేట్ పాఠశాలల్లో పిల్లలను చేర్పి మోసపోవద్దని డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి శంకర్ ప్రసాద్ తల్లిదండ్రులకు సూచించారు. ఆయన సోమవారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఎడిసన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఎలాంటి గుర్తింపు లేదన్నారు. అక్కడ చదువుతున్న విద్యార్థులను అర్హత ఉన్న ఇతర పాఠశాలలో చేర్చుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. అలాగే విద్యార్థులకు నష్టం జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

నోటీసులు అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

ఇద్దరిపై జిల్లా బహిష్కరణ వేటు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కళ్యాణదుర్గం పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులకు జిల్లా బహిష్కరణ విధించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం ఓ ప్రటకటన విడుదల చేశారు. కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి గ్రామానికి చెందిన బోయ అక్కులప్ప, జానంపల్లి గ్రామానికి చెందిన వడ్డే వెంకటేశులు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. వీరిపై ఇది వరకే వేర్వేరుగా చాలా పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులున్నా యన్నారు. అయినప్పటికీ వీరిలో మార్పు రాకపోవడంతో ఎస్పీ కే.శ్రీనివాసులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇద్దరిని 3 నెలల పాటు జిల్లా బహిష్కరణ చేస్తూ కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేసి జిల్లా బహిష్కరణ చేయించినట్లు డీఎస్పీ తెలిపారు.

జీర్ణ వ్యవస్థను కాపాడుకుందాం

బ్రహ్మసముద్రం: ఫాస్ట్ ఫుడ్ తిండి, బేకరీలో లభించే ఆహార పదార్థాలను తగ్గించుకుని అమ్మచేతి వంటకాన్ని తినడాన్ని ఇష్టపడాలని ఉపాధ్యాయులు రాజన్న విద్యార్థులకు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌కు సోమవారం రాజన్న ముఖ్య అతిథిగా హాజరై జీర్ణ వ్యవస్థ దినోత్సవం గురించి వివరించారు. ఆహారం బాగా జీర్ణం కావాలంటే టీవీలు, మొబైల్ చూస్తూ, మాట్లాడుకుంటూ భోజనం చేయరాదన్నారు. భోజనం చేసేటప్పుడు నీళ్లు తక్కువ తాగాలని అరగంట తర్వాత నీళ్లు ఎక్కువగా తీసుకుంటే ఆహారం బాగా జీర్ణం అవుతుందన్నారు. పీచు పదార్థాలను బాగా తీసుకుంటే ఇంకా మంచిదన్నారు. భోజనం తర్వాత కనీసం 100 లేదా 200 మీటర్లు మెల్లగా నడవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

4న టౌన్ బ్యాంక్ అభివృద్ధిపై సమావేశం

ఉరవకొండ : ఉరవకొండ కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు అభివద్ధి మూలధనం పెంచుట, కొత్త సభ్యులను చేర్చుకొనుట, తదితర అంశాలపై చర్చించడానికి జూన్ 4వ తేదీ (ఆదివారం) పట్టణంలోని పాత టౌన్ బ్యాంకు హాలులో సమావేశం నిర్వహిస్తున్నట్లు బ్యాంకు అధ్యక్షులు సాదు కుల్లాయిస్వామి, ఉపాధ్యక్షులు చంగల మహేష్, బ్యాంకు డైరెక్టర్లు తెలిపారు.

బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

వైసిపి నాయకుల బైక్ ర్యాలీ

రాయదుర్గం రూరల్ : రాష్ట్రంలో సీఎం జగన్ పాలన నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైసీపీ శ్రేణులు స్థానిక శాంతినగర్ లోని వైఎస్‌ఆర్ విగ్రహం నుంచి ఆర్అండ్‌బి విశ్రాంతి భవనం వరకూ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. అమరావతిలో 50 వేల మంది పేదలకు ఇళ్ల నిర్మాణాల కోసం ఒక సెంటు భూమి ఇస్తుండగా, ఓర్వలేని చంద్రబాబు సమాధి కట్టుకోవడానికి కూడా ఒక సెంటు చాలదని చేసిన వ్యాఖ్యలను వైసిపి నాయకులు ఖండించారు. ర్యాలీలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, సర్పంచిలు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయిలు తక్షణమే చెల్లించాలి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-గుత్తి

వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే కార్మికులకు పిఎఫ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణ సమీపంలోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పిఎఫ్ అవగాహన కార్యక్రమానికి హాజరైన పిఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీనివాసనాయక్‌కు సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో తాగునీరు సరఫరా చేసే కార్మికులకు ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా సంస్థ పిఎఫ్ బకాయిలను పెండింగ్ పెట్టిందన్నారు. శ్రీసత్యసాయి తాగునీటి ప్రాజెక్టులో పని చేస్తున్న 572 మంది కార్మికులకు 5 నెలలుగా, శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టులో పనిచేస్తున్న దాదాపు 300 మంది కార్మికులకు 9 నెలలుగా పిఎఫ్ బకాయిలు ఇవ్వలేదన్నారు. వెంటనే కార్మికులందరికీ పిఎఫ్ బకాయిలను వారి వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. పిఎఫ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌ఆర్ ఇన్‌ఫ్రా కాంట్రాక్టర్లు గోవర్ధన్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, కాలమనాయుడులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు తిప్పేస్వామి, మండల కార్యదర్శి వి.నిర్మల, ఎంఎన్.కవిత, నాయకులు నాగరాజు, రంగస్వామి, నబిరసూల్, శ్రీనివాసనాయక్, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలాలను పరిరక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఉరవకొండ మేజర్ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని మండల సిపిఎం కార్యదర్శి మధుసూదన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాంగ కల్యాణ మండపం దగ్గర 13.50 సెంట్లు, పాత వైసిపి కార్యాలయం వద్ద 20 సెంట్లు కబ్జా చేశారన్నారు. అలాగే టీచర్స్ కాలనీ ఎదుట ఉన్న పంచాయతీ స్థలాన్ని కొందరు అమ్ముకొని రిజిస్ట్రేషన్ చేయించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పాత స్టేట్ బ్యాంక్ దగ్గర లత్తవరం రోడ్డులో పంచాయతీలో ఎలాంటి పర్మిషన్ లేకుండా విచ్చలవిడిగా బంకులు ఏర్పాటు చేసుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాల్లో కంచె ఏర్పాటు చేయకపోతే సిపిఎం ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం సిపిఎం జెండాలు పాతి పంపిణీ చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో చంద్రమౌళికి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో సిపిఎం నాయకులు రామాంజనేయులు నాయక్, మురళి, రవి, శీనప్ప, సిద్ధప్ప, మోహన్, వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

దారి సమస్యను పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పెద్ద పడమల రైతులు

తమ పొలాల్లోకి వెళ్లే పూర్వపు దారిని కొందరు అడ్డగిస్తున్నారని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద పడమల రైతులు వినతి పత్రం అంద జేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పెద్ద పొడమల గ్రామ పొలాల్లో సర్వే నంబర్ 1 నుంచి 150 వరకు దాదాపు 600 ఎకరాలు ఉన్న భూమిలో 300 మంది రైతులు భూములు కలిగి ఉన్నారన్నారు. ఆ భూముల్లోకి వెళ్లే దారిని ప్రస్తుతం అదే గ్రామంలో ఉన్న రామ నరసింహారెడ్డి, పునీత్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి అనే వ్యక్తులు అడ్డగిస్తూ అటుగా వెళ్లే రైతులపై దౌర్జన్యం చేసి దాడులకు పాల్పడుతున్నారని వాపోయారు. అలాగే కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్పీ పరిశీలించి న్యాయం చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో రైతు సంఘం జిల్లా నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రాజారామిరెడ్డి, పెద్ద పడమల రైతులు బియ్యం నరసింహారెడ్డి, వెంకటేష్, నాగరాజు, లక్ష్మి రెడ్డి, ఎర్రపురెడ్డి, ఆదినారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు

ప్రజాశక్తి-గుత్తి

గుత్తిలో రిలే దీక్షల్లో పాల్గొన్న ఉద్యోగులు, కార్మికులు

రాష్ట్ర ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గుత్తి పట్టణంలో ఏపీ రాష్ట్ర ఉద్యోగుల సంఘం(ఏపీ జిఇఎ) ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన శిబిరంలో ఏపీ జిఇఎ తాలూకా అధ్యక్షులు డాక్టర్ ఎల్లప్ప, నాయకులు ఆదినారాయణ, దేవదాసు, నరసింహులు, రాఘవరెడ్డి, లోకేష్ కూర్చొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీనే జీతభత్యాలు చెల్లించేలా చట్టం తేవాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎన్ఎంఆర్, దినసరి కూలీలు, కంటింజెంట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జిపిఎఫ్, ఏపీజిఎల్ఐలకు భద్రత కల్పించాలన్నారు. తమ 200 డిమాండ్ల సాధన కోసం కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జిఇఎ జిల్లా నాయకులు శ్రీరామ్మూర్తి, నాగరాజు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల అజాగ్రత్త వల్లే తాగునీటి సమస్య

కౌన్సిల్ సమావేశంలో సభ్యుల అసంతృప్తి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప

అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడంతోనే పట్టణంలో తాగునీటి సమస్య ఏర్పడిందని పలువురు కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక పురపాలక సం ఘం కార్యాలయంలో సోమవారం ఛైర్‌పర్సన్ శిల్ప అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని అధికారులు మోటార్ల నిర్వహణ, విద్యుత్, తాగునీటి సరఫరా విషయాల్లో ముందుచూపుతో వ్యవహరించాల్సి ఉందన్నారు. శాంతినగర్‌లో మోటర్ చెడిపోయి 2 నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. దీనిపై కమిషనర్ దివాకర్‌రెడ్డి స్పందిస్తూ తక్షణం సమస్యను పరిష్కరిస్తామన్నారు. గతంలో టవర్ క్లాక్ ఉన్న స్థలం చుట్టూ, తమలపాకులు విక్రయించే చోట ఇరుకుగా ఉండడం వల్ల ఆటో కూడా వెళ్ల లేని పరిస్థితి ఉందని కౌన్సిలర్లు అజయ్, పద్మజ కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. కూరగాయలు రోడ్డుపై విక్రయాలు చేస్తుండటంతో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దీనిపై కమిషనర్ మాట్లాడుతూ ఆ ప్రాంతంలో వ్యాపారాలు నిర్వహించే వారిని గుర్తించి ఒక ప్రదేశంలో విక్రయిం చుకునేలా వీలు కల్పిస్తామని తెలిపారు. పట్టణంలో అక్రమంగా లేఅవుట్లు వేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై కౌన్సిలర్ అజయ్ ప్రశ్నించారు. బళ్లారి రోడ్డులో బస్సులు నిలబడడం, వాటికి అడ్డంగా ఆటోలు నిలపడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారిందని, అక్కడ కానిస్టేబుల్ ఉండేలా చూడాలని ఛైర్‌పర్సన్ శిల్ప అక్కడే ఉన్న ఏఎస్ఐ వెంకటేశ్‌కు సూచించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు కమిషనర్ బదులిచ్చారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ ఛైర్మన్లు, కౌన్సిలర్లులు సంజీవ, శారదమ్మ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చేతకాని పాలకులు.. చెట్ల కింద చదువులు..

డి.హిరేహాల్ జూనియర్ కళాశాల దుస్థితిపై కాలవ సెల్ఫీ ఛాలెంజ్

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

సెల్ఫీ ఛాలెంజ్ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి చేతకానితనం వల్ల ఐదేళ్లుగా డి.హిరేహాల్ జూనియర్ కళాశాల విద్యార్థులు చెట్ల కిందే విద్యాభ్యాసం సాగిస్తున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా సోమవారం ఆయన టీడీపీ హయాంలో మంజూరు చేసిన కళాశాల దుస్థితిపై సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డి.హిరేహాల్ మండలంలో పదో తరగతి తర్వాత చదువు మానేస్తున్న విద్యార్థుల కోసం టిడిపి హయాంలో 2019-20 విద్యా సంవత్సరంలో ఈ కళాశాలను ప్రారంభించామన్నారు. ఐదేళ్లు గడుస్తున్నా శాశ్వత భవనం ఎందుకు కట్టించలేదని ప్రశ్నించారు. అధ్యాపకుల కొరత, సరైన వసతులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు జరగడం లేదన్నారు. ఇకనైనా ఎమ్మెల్యే కాపు మొద్దు నిద్రలేచి ఈ కళాశాల దుస్థితిపై ఉన్నతాధికారులతో సమీక్ష చేసి శాశ్వత భవన నిర్మాణంతో పాటు అధ్యాపకుల నియామకంపై శ్రద్ధ పెట్టాలని డిమాండ్ చేశారు. లేనిచో తాను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిచాక భవనం, పూర్తిస్థాయిలో వసతులు కల్పిస్తానని కాలవ హామీ ఇచ్చారు.

అనంతపురంలో ఓవర్ బ్రిడ్జిపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రహదారి పనులు మూడు నెలల్లో పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం : నగరంలోని బళ్లారి బైపాస్ నుంచి పంగల్ రోడ్డు వరకూ చేపట్టిన ఓవర్ బ్రిడ్జి, జాతీయ రహదారి నిర్మాణ పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తి కావడంతో సోమవారం ఎమ్మెల్యే అనంత ఆధ్వర్యంలో నగరంలో వందలాది బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. నూతనంగా నిర్మించిన బళ్లారి బైపాస్ జాతీయ రహదారి నుంచి ఓవర్ బ్రిడ్జి, టవర్ క్లాక్ సప్తగిరి సర్కిల్ మీదుగా శ్రీకంఠం సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ 15 నెలల్లోనే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, గౌస్‌బేగ్ పాల్గొన్నారు.

గాలివానకు మిద్దికూలి ఒకరికి తీవ్రగాయాలు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని సిద్ధరాంపురం గ్రామంలో గాలివానకు మిద్దె కూలి బోయ వీరేష్ తీవ్రంగా గాయపడినట్లు మాజీ సర్పంచి పెద్ద రామన్న తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పెద్దఎత్తున గాలివాన రావడంతో గ్రామంలోని వీరేష్ పాత మిద్దె కూలింది. ఆ సమయంలో వీరేష్ ఇంట్లోనే ఉండడంతో తాటి తీర్లు మీద పడడంతో కాలు విరిగింది. దీంతో అతడిని బళ్లారి ఆసుపత్రికి తరలించారు. మిద్దె కూలిన సమయంలో కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లిన కారణంగా పెద్ద ప్రమాదం తప్పింది. వారు ప్రస్తుతం దుర్గమ్మ ఆలయంలో తలదాచుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-గార్లదిన్నె

రాష్ట్రంలో ఏర్పాటు చేసిన వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎగువపల్లి దగ్గర ఉన్న ఫంక్షన్ హాలులో సోమవారం 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పద్మావతి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వాలంటీర్లు ప్రభు త్వం, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవలందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా అనేకమందికి ఉద్యోగావకాశాలు కల్పించి ప్రజా సంక్షేమమే ధ్యే యంగా పని చేస్తుందన్నారు. అనంతరం ఉత్తమ సేవలందించిన వాలంటీర్లకు శాలువా కప్పి సన్మానించారు. వారిలో ఇద్దరు సేవా వజ్ర, ఐదుగురు సేవామిత్ర పురస్కారాల కింద బ్యాడ్జి, ప్రశంసాపత్రాలు, ప్రోత్సాహకం అందుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, జడ్పీటీసీ సంధ్య రాణి, మాజీ ఎంపిపి ప్రదీప్ రెడ్డి, మండల కన్వీనర్ నరేందర్ రెడ్డి, ఎంపీడీఓ తేజోష్ణ, ఈఓఆర్డీ వెంకటలక్ష్మమ్మ, సింగిల్ విండో అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, ఎంపిటీసీలు సర్పంచిలు, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితునికి మూడేళ్లు జైలు

ప్రజాశక్తి-అనంతపురం

ఓ హత్య కేసులో నిందితునికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాసులు సోమవారం నాడు తీర్పు వెలువరించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణం ఎన్జీవో కాలనీలో నివాసం ఉంటున్న కుమ్మరి కుమార్ భార్య కుమ్మరి మల్లీశ్వరి(42)కు తిరుపతి ఎస్‌టివి నగర్, అంబేద్కర్ రోడ్డుకు చెందిన గజ్జల అశోక్ కుమార్‌తో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయంలో కుమ్మరి కుమార్, అశోక్‌కుమార్ రెండు కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. అప్పటి దాకా కదిరిలో ఉంటున్న గజ్జల అశోక్ కుమార్ ఘర్షణల అనంతరం తన కుటుంబాన్ని తిరుపతికి మార్చా డు. తిరుపతికి వెళ్లిన తరువాత కూడా మల్లీశ్వరి, అశోక్‌కుమార్ మధ్య ఫోన్ సంభషణలు ఉండేవి. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని మల్లీశ్వరి అశోక్‌కుమార్‌ను కోరింది. దీంతో మల్లీశ్వరి చంపేస్తే సమస్య తీరుతుంద ని అశోక్‌కుమర్ భావించాడు. అందులో భాగంగా 30-8-2017న వినా యక చవితి పండుగ నేపథ్యంలో కు మ్మరి మల్లీశ్వరి కలవడానికి తిరుపతి నుంచి Ap 03 tv 5788 కారులో స్వయంగా డ్రైవింగ్ చేసుకుని అశోక్ కుమార్ వచ్చాడు. మార్గమధ్యంలో మదనపల్లిలో ఒక కొడవలి కొని కారులో పెట్టుకున్నాడు. అప్పటికే తనకోసం సత్యసాయి జిల్లా కొక్కటి క్రాస్ వద్ద వేచిఉన్న కుమ్మరి మల్లీశ్వరిని కారులో ఎక్కించుకుని తనకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని మండ్లపల్లి గ్రామం వద్దగల భారత్ పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న మామిడి తోపులోకి తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరం పెళ్లి చేసుకుందామని మల్లీశ్వరి అశోక్‌కుమార్‌ను కోరింది. అప్పటికే వివాహం అయిన గజ్జల అశోక్ కుమార్ ఆమె మాటతో ఏకీభవించ లేదు. దీనికి తోడు ఆమెపై అప్పటికే కక్షతో ఉన్న అశోక్‌కమార్ తన కారులో తెచ్చుకున్న కొడవలితో మల్లీశ్వరిని నరికి హత్య చేశాడు. అనంతరం కొక్కంటి గ్రామ విఆర్‌ఓ వెంకట రమణ సమక్షంలో కారుతో సహా లొంగిపోయాడు. ఈ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. కేసులో పలువురు సాక్షులను విచారించిన అనంతరం అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శ్రీనివాసులు నిందితుడు అశోక్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితునికి శిక్ష పడేలా వ్యవహరించిన విచారణ అధికారులు సిఐలు శ్రీధర్, మన్సురుద్దీన్ కోర్టు కానిస్టేబుల్ మధు, పిపి హరినాథ్‌రెడ్డిని ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు.

వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి : ఎమ్మెల్యే కాపు

గుత్తిలో విత్తన వేరుశనగ అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్ : వైసిపి ప్రభుత్వం రైతుల పక్షపాతి అని కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని 74-ఉడేగోళం రైతు భరోసా కేంద్రం వద్ద సోమవారం ఆయన రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాపు మాట్లాడుతూ గత ప్రభుత్వాల మాదిరి కాకుండా జగన్ హయాం లో గ్రామీణ ప్రాంతాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తన వేరుశనగ, ఎరువులు పంపిణీ చేస్తున్నాం న్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలను తెప్పించి పంపిణీ చేయాలని సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మా నాయక్, వ్యవసాయ అధికారి మహేంద్రకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచి దుర్గమ్మ, ఎంపీపీ విద్యావతి, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి ఉపేంద్రరెడ్డి, మాధవరెడ్డి, నాగిరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

నార్పల : నార్పలలో సోమవారం విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు ఎఒ ముస్తఫా తెలిపారు. సబ్సిడీ రూ. 1,116 పోనూ ఒక బ్యాగుకు రూ. 1,674గా చెల్లించాలి. అవస రమైన మండల రైతులు తీసుకెళ్లాలని సూచించారు. విత్తుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీ అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో విత్తన సరఫరా చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా ఛైర్మన్ నాగలింగారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ లోకనాథ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు పెద్దిరెడ్డి, ఎంపిటిసి రాజారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఉరవకొండలో విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

బెళుగుప్ప: ప్రభుత్వం సబ్సిడీతో అందించే విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి మమత సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం జడ్పిటిసి, ప్రజాప్రతినిధులు రాయితీ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన వేరుశనగ విత్తనాన్ని 40 శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పథ్విసాగర్, సింగిల్‌విండో అధ్యక్షులు శివలింగ, మండలం వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ శ్రీనివాసులు, సర్పంచి సాలిబాయి, నక్కలపల్లి సర్పంచి రామిరెడ్డి, నాయకులు త్రిలోక్, పురుషోత్తం, కరుణాకర్, నరిగన్న, రైతులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి : రైతుల అభివద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని వన్నెదొడ్డి గ్రామంలో సోమవారం సర్పంచి బేడల లక్ష్మీదేవి, వైసిపి నాయకులు బేడల వెంకటరాముడు ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రంలో రాయితీ విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రైతులకు బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అనంతరం బేడల వెంకటరాముడు ఆధ్వర్యంలో రైతులకు భోజన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ జి.విశాలాక్షి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి. వన్నూరుబి, ఏడిఏ నారాయణ నాయక్, ఏఓ ముస్తాక్ అహ్మద్, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాసరెడ్డి, మండల, పట్టణ కన్వీనర్లు జి.గోవర్ధన్‌రెడ్డి, డి.హుస్సేన్‌పీరా, మాజీ ఎంపీటీసీ శ్రీరాములు, కౌన్సిలర్లు వాల్మీకి శివ, ఫారూఖ్, వరద, ఆర్‌బికె ఇన్‌ఛార్జి మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో రాయితీ విత్తన వేరుశనగ పంపిణీని సోమవారం ఏవో వెంకటేశ్వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రతి ఆర్‌బికెలో రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తారని, అవసరం ఉన్న రైతు రిజిస్ట్రేషన్ చేయించుకొని పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, వైస్ ఎంపీపీలు నీలిమ, విజయ్, ఆత్మకూరు సర్పంచి వరలక్ష్మి, ఉప సర్పంచి చంద్రకళ, దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి, కొండారెడ్డి, వెంకటరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, అతికిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఉరవకొండ ఎంపీపీ చంద్రమ్మ పేర్కొన్నారు. ఎఒ శశికళ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ చంద్ర మ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జడ్పిటిసి పార్వతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విత్తన వేరుశెన కాయలను రైతులతో కలిసి పరిశీలించారు. అలాగే మండల పరిధిలోని మోపిడి గ్రామంలో ఉరవకొండ ఏడిఏ పద్మజ ఆధ్వర్యంలో రైతులకు విత్తన వేరుశనగ కాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిరికల్చర్ అసిస్టెంట్ లక్ష్మీదేవి, అశోక్ కుమార్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండల పరిధిలోని సోదనపల్లి రైతు భరోసా కేంద్రంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి రాయితీ విత్తన వేరుశనగను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి చిన్నమ్మతో కలిసి రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ కాయలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ రైతులు ఆర్‌బికెలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే రైతులతో ముఖాముఖిగా మాట్లాడి రైతు భరోసా కేంద్రాలు ఏవిధంగా ఉపయోగపడుతున్నాయని ఆరా తీశారు. ఆర్‌బికెలు చాలా బాగా ఉపయోగ పడుతున్నాయని రైతులు తెలిపారు. కార్యక్రమంలో ఏంపీపీ యోగేశ్వరి, సోదనపల్లి సర్పంచి బొమ్మన గోపాల్‌రెడ్డి, ఎంపిటిసి చిన్న జయన్న, వైసిపి సీనియర్ నాయకులు కోరే రాముడు, వ్యవసాయ సిబ్బంది అమరేష్, రాజా రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సోదనపల్లిలో వేరుశనగను పంపిణీ చేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం : సబ్సిడీ అంతర పంటల విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. ఆమె సోమవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేరుశనగ తో పాటు అంతర పంటలైన కంది, పెసర విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీ ధరపై అందజేస్తుం దని తెలిపారు. మండలంలో 1400 క్వింటాళ్లకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారికి పంపిణీ చేస్తారని తెలిపారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు కూడా 10 క్వింటాళ్లు వచ్చాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచి పార్వతి, జడ్పీటీసీ నీలం భాస్కర్, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పెద్ద కొండయ్య, మాజీ ఎంపీపీ గువ్వల రాజశేఖర్‌రెడ్డి, మండల ఇన్‌ఛార్జి ఆలూరి రమణారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం సభ్యులు ముత్యాల శ్రీనివాసులు, వ్యవసాయ సలహా మండలి సభ్యులు రుషింగప్ప, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రంలో వేరుశనగ పంపిణీ చేస్తున్న ఎంపిపి సునీత